بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V 14.10.2022 (Telugu)**

# మనము బైఅత్ హక్కు చెల్లించవలసినచో, అల్లాహ్ ఉపకారములకు అతనికి కృతజ్ఞత తెలుప వలసినచో మనము అనుక్షణం ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరమున్నది

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 14.10.2022 తేదీన - మస్జిద్ బైతుర్రహ్మాన్, మెరిల్యాండ్, అమెరికాలో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

**అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వహ్దహూ లా షరీకలహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహు వ రసూలుహు. అమ్మా బఅదు ఫఅవూజు బిల్లాహి మినష్షైతా నిర్రజీమ్ - బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం - అల్ హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్ - అర్రహ్మా నిర్రహీం - మాలికి యౌమిద్దీన్ - ఇయ్యాక నఅబుదు వ ఇయ్యాక నస్తయీన్ - ఇహ్దినస్సిరాతల్ ముస్తఖీమ - సిరాతల్లజీన అన్ అమ్త అలైహిం ఘైరిల్ మఘ్జూబి అలైహిం వలజ్జాల్లీన్. (ఆమీన్)**

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. మనపై అల్లాహ్ తఆలా చేసిన ఒక పెద్ద ఉపకారమేమనగా హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసులు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ను స్వీకరించే అనుగ్రహము మనకు కల్గించెను. ఈ ఉపకారమునకు స్వచ్ఛమైన కృతజ్ఞతగా మనము అల్లాహ్ ఆజ్ఞలను పాటించవలెను. దైవ హక్కులు, ప్రజా హక్కులను చెల్లించుటకు కృషి చేయవలెను. మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ హక్కును చెల్లించుటకు ప్రయత్నించినప్పుడే ఇది సాధ్యమగును. మనము స్వచ్ఛమైన ముస్లిములమగుటకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వైపు చూడవలసి వుండును. వారు (అ) సూచించిన పద్ధతి ప్రకారము మన జీవితములను గడుపుకోవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తనను పూర్తిగా నమ్మవలెనని, గట్టిగా విశ్వసించవలెనని ఉపదేశిస్తు ఇట్లనిరి. విశ్వసించిన వారు ప్రగతి చెంది తమ విశ్వాసమును నమ్మకము, జ్ఞానము వరకు పెంచుకోవలెను. కాని అపోహాలో చిక్కుకోకూడదు. ఇంకా ఇట్లనిరి. మంచిగా ఆలోచించండి, మీరు నా హస్తమున బైఅత్ ప్రతిజ్ఞ చేశారు. నన్ను వాగ్దత్త మసీహ్‌గా, నిర్ణయాధికారిగా, న్యాయమూర్తిగా మీరు విశ్వసించారు. ఇలా విశ్వసించిన తర్వాత ఏదేని నా తీర్పు, కర్మ గురించి మనసులో ఏమైనా అనుమానము, సందేహము వున్నట్లయితే తమ విశ్వాసము గురించి చింతించండి. నన్ను విశ్వసించిన తర్వాత కూడ ఏదైనా విమర్శ కలిగి వున్నచో అతడు మరింత దురదృష్టవంతుడు. ఎందుకనగా అతడు చూసినను అంధునిగానే మిగిలి పోయెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం కూడ వారి అలైహిస్సలాం తర్వాత ఖిలాఫత్ శుభవార్త అందించివుండిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పద్ధతినే కొనసాగించు వ్యవస్థయే అహ్మదియ్య ఖిలాఫత్. తన ప్రతిజ్ఞలో ప్రతి అహ్మదీ అహ్మదియ్య ఖిలాఫత్‌తో ముడిపడి వుంటానని, విధేయత వహిస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. ఈ విధంగా ఖిలాఫత్‌తో ముడిపడి వుండే ప్రతిజ్ఞను నెరవేర్చుట ప్రతి అహ్మదీయుని కర్తవ్యము. లేనిచో బైఅత్ ప్రతిజ్ఞ అసంపూర్ణమగును.

పవిత్ర ఖుర్‌ఆన్‌ను శ్రద్ధతో చదవాలని సూచిస్తు హుజూర్ అలైహిస్సలాం ఇట్లనిరి. నా అనుచరులకు నేను పదే పదే ఇట్లు ఉపదేశిస్తుంటాను. వాస్తవములను బహిర్గతపరచుటకు అల్లాహ్ తఆలా ఈ

సంస్థను స్థాపించెను. ఆచరణీయ సత్యము ద్వారా ఇస్లాం విశిష్టత ప్రపంచానికి తెలియవలెనని నేను ఆశిస్తున్నాను. ఇందు కొరకే అల్లాహ్ తఆలా నన్ను నియమించెను. అందుకే పవిత్ర ఖుర్ఆన్‌ను తరచుగా పఠించండి. కాని కేవలం ఒక కథగా కాకుండా ఒక తత్వముగా భావించి చదవండి. మనము ప్రాపంచిక పనులలో నిమగ్నమై వున్నచో మన పిల్లలు, తరాలు ధర్మము నుండి దూరమగుదురు. ఇవి చాలా గమనించదగ్గ విషయములు. కేవలం బైఅత్ చేయడంతో లక్ష్యము నెరవేరదు. మనము ఇస్లామీయ బోధనలకు అనుగుణంగా మారినప్పుడే ఈ లక్ష్యము నెరవేరును. మనము పవిత్ర ఖుర్ఆన్ పఠించి, దానిని అనుసరించనంత వరకు అది సాధ్యము కాదు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. నిజమైన విషయమేమనగా అల్లాహ్ తఆలా శాశ్వత జీవితము కొరకు సృష్టించిన చెలిమ వద్దకు మీరు చేరుకున్నారు. కాని ఇంకా మీరు నీరు త్రాగలేదు. అల్లాహ్ తఆలా మీకు పుష్టిగా నీరు త్రాగించాలని మీరు అల్లాహ్ తఆలా దయ, కరుణతో అనుగ్రహము యాచించండి. ఎందుకనగా అల్లాహ్ తఆలా సహకరించనిదే ఏదియును సాధ్యము కాదు. ఈ చెలిమ నుండి త్రాగిన వ్యక్తి నాశనము కాదని నేను నిశ్చయముగా నమ్ముతున్నాను. ఎందుకనగా ఇది ప్రాణ దాత. ఈ చెలిమ నుండి పుష్కలంగా త్రాగడానికి గల పద్ధతి ఏమిటనగా అల్లాహ్ తఆలా మీపై విధించిన రెండు హక్కులను సహృదయముతో మీరు చెల్లించండి. వాటిలోని ఒకటి దేవుని హక్కు కాగా మరొకటి ప్రజల హక్కు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. బైఅత్ చేయడం మాత్రమే సరిపోదు. అల్లాహ్ తఆలా ఆచరణను ఆశించును. ఆచరించినవారు ఎన్నడు నాశనం కారు. ఎల్లప్పుడు అల్లాహ్ తఆలా శుభములను పొందుతారు. లాఇలాహ ఇల్లల్లాహ్‌ను మీరు బాహ్యాంతరముగా ఆచరించినప్పుడే ఈ ఆచరణ స్థితి ఏర్పడును. మీకు అల్లాహ్ తఆలా తప్ప మరే కోరిక వుండకూడదు. అల్లాహ్ తఆలా ఆదేశములను పూర్తిగా అనుసరించండి. మనము కలిమా చదివినప్పుడు అల్లాహ్ తఆలా ప్రీతిని పొందుట మన లక్ష్యముగా వుంటుందా ? అని ప్రతి ఒక్కరు ఆత్మ పరిశీలన చేసుకోవచ్చును. మనము అతని ఆదేశమును పాటిస్తున్నామా? నమాజుల సమయములలో ప్రాపంచిక పనులను వీడి నమాజ్ చదువుటకు మనకు శ్రద్ధ కలగనిచో మనము కేవలం నోటితోనే కలిమా చదువుతున్నట్లగును. కాని తాత్కాలిక అన్యారాధన మన హృదయములో వున్నట్లగును. నా వ్యాపారములో, నా పనులలో అల్లాహ్ తఆలా అనుగ్రహముతోనే శుభము కలుగునని ఒక విశ్వాసి నమ్మకము కలిగి వుండును. కావున నా ప్రాపంచిక పనులు అల్లాహ్ తఆలాకు పోటీగా ఎలా నిలుచును. ఇలా అయినచో మనము కలిమా స్ఫూర్తిని అర్థమే ఏసుకోలేదు. మనము నోటితో కలిమాను పలుకుతున్నాము. కాని మన కర్మలు మన వాక్యలకు అనుగుణంగా లేవు. ఇదే పరిస్థితి వున్నచో బైఅత్ హక్కును చెల్లిండం లేదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ప్రజా హక్కులను చెల్లించాలని అల్లాహ్ తఆలా మనకు సూచించెను. వీటిని చెల్లించినప్పుడే ఎవరైనా నిజమైన విశ్వాసి అగును, బైఅత్ హక్కు చెల్లించినట్లగును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ జమాఅత్‌ను ఉపదేశిస్తు ఇట్లనిరి. ప్రాపంచికుల వలె వున్నచో ఎలాంటి ప్రయోజనం లేదు. నా హస్తమున పశ్చాత్తాపపడడం అనగా ఒక మృత్యువును ఆశించును. తద్వారా మీరు ఒక క్రొత్త జీవితమును పొందగలరు. మీకు ఆధ్యాత్మిక జీవితము లభించనిచో ఇటువంటి బైఅత్ ఎలాంటి ప్రయోజనము కలిగించదు. నా బైఅత్ ద్వారా అల్లాహ్ తఆలా హృదయపూర్వక అంగీకారము ఆశించును. నిజమైన మనసుతో నన్ను స్వీకరించిన వ్యక్తి తమ పాపముల నుండి పశ్చాత్తాప

పడును. అప్పుడు అల్లాహ్ అతనిని క్షమించును. అతడు తల్లి గర్భము నుండి ఇప్పుడే జన్మించినట్లగును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ప్రార్థనలు నిస్వార్థమైనవి, కర్మలు అల్లాహ్ తఆలా ప్రసన్నతను పొందుటట్లు వుండవలెను. ప్రస్తుతం ప్రపంచ పరిస్థితులతో తెలియునదేమనగా ఎంతో భయంకరమైన వినాశనకర మేఘాలు క్రమ్ముకున్నాయి. సంభవించే వినాశనము ప్రపంచమును అంతమొందించును. కావున ఇప్పుడు అహ్మదీయులు దుఆలలో నిమగ్నము కావలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. పుణ్యుల వలన అల్లాహ్ తఆలా ఇతరులను కూడ రక్షిస్తాడు. మనము చాలా ప్రమాదకర కాలమును గడుపుతున్నాము. ఇటువంటి పరిస్థితులలో అల్లాహ్ తప్ప మరెవ్వరు రక్షించలేరు. తాము తమ సంతానమును అల్లాహ్ తఆలా ఆస్థానములో మోకరిల్లేటట్లు చేయండి. తద్వారా తమను, తమ సంతానమును రక్షించుకోవచ్చును. ప్రపంచ పరిస్థితులు అతిగా దిగజారకముందే చాలా దుఆలు చేయండి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. ముందస్తుగా చేయునదే పుణ్యము. తర్వాత చేసినచో ఎలాంటి ప్రయోజనము కలుగదు. నావ మునిగినప్పుడు అందరు ఏడుస్తారు. కాని పడవ మునుగుతున్నప్పుడు రోధించడం, కేకలు వేయడం లాభించదు. శాంతియుత కాలములోనే అది లాభించును. ముందుగానే తనపై పిడుగు పడినట్లు చైతన్యము చెంది రోధించడమే దేవుణ్ణి పొందు సూత్రము. కాని పిడుగు పడుతున్నట్లు చూసి ఏడ్చినవాడు పిడుగుతో భయపడుతున్నాడు తప్ప దేవునితో కాదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేడు అహ్మదీయుల విశ్వాసము, అల్లాహ్ తఆలాతో సంబంధము, దుఆలే ప్రపంచమును వినాశనము నుండి రక్షించవచ్చును. ప్రజల పట్ల సానుభూతి కలిగించుకొని ప్రపంచము కొరకు దుఆలు చేయండి. దైవ హక్కులు, ప్రజల హక్కుల పట్ల శ్రద్ధ లేనిచో ఈ ప్రపంచము నిర్మానుష్యముగా మారును. ప్రతి అహ్మదీ ఇదే ఆలోచనతో తమ కర్తవ్యమును నిర్వర్తించవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. మీరు కొంత వరకు కష్టపడి పొలం పదును చేసిన తర్వాత కొంత లాభమును ఆశిస్తారు. ఇలాగే శాంతియుత రోజులు కూడ కష్టపడవలసినవే. ఇప్పుడు అల్లాహ్‌ను స్మరించుకొన్నచో లాభము పొందగలరు. ఇప్పుడు దుఆ చేసినచో ఆ దయామయుడు, కరుణామయుడు కరుణించును. అల్లాహ్ తఆలా ఈ ఆపదను తొలగించవలెనని, ఈ శిక్ష నుండి రక్షించవలెనని నమాజులలో, రుకూలలో, సాష్టాంగములలో దుఆలు చేయండి. దుఆ చేయువాడు ఎన్నడు కోల్పోడు. దుఆ చేయువాడు మరణించుట సాధ్యము కాదు. ఇలా జరిగినచో దేవుడు ఎన్నడు గుర్తించబడడు. సారాంశమేమనగా పూర్తిగా మీలో స్వచ్ఛమైన వినయము కలుగవలెను. నేడు కూడ ఇటువంటి వినాశనకర లక్షణములే కనిపిస్తున్నాయి. ఇందుకు మనము అల్లాహ్ తఆలా ఆస్థానములో మోకరిల్లవలెను. ఎందుకనగా ప్రపంచమును రక్షించు మార్గము ఇదొక్కటే.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. గొప్ప సద్గుణములను ప్రదర్శించుట కూడ అల్లాహ్ తఆలా ఆదేశములలో ఒక ఆదేశము. ఇట్లనిరి. దుర్భాషల వలన శత్రుత్వము ఏర్పడుతుంది. ఇందుకే తమ నాలుకను ఎల్లప్పుడు తమ అధీనములో పెట్టుకొనుము. ఇస్లాం సత్ప్రవర్తనల పరిధిలో వుండవలెనని బోధించిన విధంగానే చట్ట పరిధిలో కూడ వుండవలెనని గట్టిగా సూచిస్తుంది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. పరస్పరం ప్రేమానురాగము, ఆప్యాయత కలిగించుకొనుట కూడ అహ్మదీయులలో వుండవలసిన మరొక ప్రత్యేకత. ఇట్లనిరి. మన జమాఅత్‌లో పరస్పరం సానుభూతి ఏర్పడనంత వరకు నిజమైన ప్రగతి లభించదు. వారిట్లు సూచించిరి. మనము అహ్మదియ్య జమాఅత్‌లో ప్రవేశించి ఒక ఆధ్యాత్మిక సంతానముగా మారినాము. ఒకరికి మరొకరిపై

ప్రాధాన్యత లేదు. ఇంకా ఇట్లనిరి. అల్లాహ్ తఆలా మన జమాఅత్‌ను ఆదర్శంగా చేయదలచెను. కేవలం పైపై మాటలతో, గాఢమైన ఆచరణ లేనిదో ఆదర్శంగా నిలువగలరా? ఇందుకు చాలా కష్టించవలసి వుండును, ప్రయత్నించవలసి వుండును. తమ ప్రార్థనల ప్రమాణమును పెంచుకోవలెను. తమ సత్ప్రవర్తనల ప్రమాణములను చక్కదిద్దుకోవలెను. పరస్పరం ఆప్యాయత, అనురాగ ప్రమాణమును స్థిరపరుస్తు మనము ఆదర్శవంతంగా మారుతున్నామా లేదా అని ఆత్మ పరిశీలన చేసుకోవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. అల్లాహ్ తఆలా నిష్టాపరుణ్ని ఆదరించును. అల్లాహ్ తఆలా వైభవమును గుర్తించుకొని అందరు భయపడండి. అల్లాహ్ తఆలా భయమును, భీతిని తమ హృదయములలో కల్పించుకోండి. అందరు అల్లాహ్ తఆలా దాసులే అని గుర్తుంచుకోండి. ఎవరిని హింసించకండి. ఎవరిని చిన్న చూపు చూడకండి. ఒక్క వ్యక్తి మలినమైనచో అతడు అందరిని మలినము చేయును. గొప్ప నిష్టాపరత వున్నప్పుడే గొప్ప ప్రమాణములు, గొప్ప ప్రవర్తనలు కలుగును. అవతార పురుషునిగా ప్రకటించుకున్న వ్యక్తితో మన జమాఅత్ సభ్యులు ముడిపడి వున్నారు. తమలో నిష్టాపరత వున్నదా లేదా అని మన జమాఅత్ అన్నిటికంటే ఎక్కువ గమనించివలెను. మనము బైఅత్ హక్కు చెల్లించవలసినచో, మనము అల్లాహ్ తఆలా ఉపకారములకు కృతజ్ఞతలు తెలుపవలసినచో మనము అనుక్షణం తమ పరిస్థితులను గమనిస్తుండవలసిన అవసరమున్నది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆశయము మేరకు తమ జీవితములను గడుపుకొనుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! మనము ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యత ఇవ్వవలెను. అల్లాహ్ తఆలా భీతి మనలో పుట్టవలెను. మనము నిజమైన రీతిలో అష్‌హదు అల్లాఇలాహ ఇల్లల్లాహ్ హక్కును చెల్లించువారము అగుదుము గాక! అల్లాహ్ తఆలా హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లంకు శుభవార్త అందించిన తుది జమాఅత్‌లో మనము చేరువారమగుదుము గాక! అల్లాహ్ తఆలా ఇందుకు మనందరిని అనుగ్రహించుగాక! ఆమీన్

**అల్ హందులిల్లాహి నహ్‌మదుహు వనస్తఈనుహు వనస్తఘ్‌ఫిరుహు వ నూమిను బిహి వ నతవక్కలు అలైహి వ నవూజు బిల్లాహి మిన్ షురూరి అన్‌ఫుసినా వ మిన్ సయ్యిఆతి ఆమాలినా మంయ్యహ్‌దిహిల్లాహు ఫలా ముజిల్లలహు వమంయ్యుజ్‌లిల్‌హు ఫలా హాదియలహు వనష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వనష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్‌దుహు వ రసూలుహు. ఇబాదల్లాహి రహిమకుముల్లాహి ఇన్నల్లాహ యఅమురు బిల్ అద్‌లి వల్ ఇహ్‌సాని వ ఇయితా ఇజిల్ ఖుర్బా వ యన్‌హా అనిల్ ఫహ్‌షాఇ వల్ మున్‌కరి వల్ బఘిఇ యఇజుకుం లఅల్లకుం తజక్కరూన్. ఉజ్‌కురుల్లాహ యజ్‌కురుకుం వద్‌వూహు యస్తజిబ్‌లకుం వలజిక్‌రుల్లాహి అక్బర్.**

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*